క్లుప్తంగా

వైద్య శిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ముదిగొండ: మండలంలోని గోకినపల్లి గ్రామంలో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ లైన్స్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.3 0మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఏటుకూరి వెంకటరామారావు, గల్లా వెంకటరమణ, దండా రవీంద్రబాబు, లింగస్వామి, జగన్మోహన్‌రావు, కంటి వైద్య నిపుణులు రవిచంద్రశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట గ్రామంలో శనివారం రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్చకులు అనిపెద్ది సుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో గోపాలపేట రోడ్డులో రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని గణపతి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ట్రేడ్ యూనియన్ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రామయ్య

సత్తుపల్లిరూరల్: జూన్ 21, 22వ తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య పిలుపు నిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులను గుర్తిస్తూ పనికి తగ్గ వేతనం ఇస్తుంటే.. మన దేశంలో కార్మికుల శ్రమకు గుర్తింపు లేకపోగా కనీస వేతనాల ఊసే లేదని విరమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వై.పుల్లయ్య, అశోక్, రాందాస్, శరత్, లాల్‌మియా, లక్ష్మీనారాయణ, పుల్లారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

మధిర: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని రైల్వే టికెట్ బుకింగ్ అధికారులు పద్మారావు, గొమాంగో తెలిపారు. మధిర రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ బుకింగ్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న ఆనంద్ బాబు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది సత్యనారాయణ, సురేష్, అనీల్, శర్మ, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3నుంచి భూ భారతిపై సదస్సులు

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు భూ భారతిపై సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.ఉషాశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సిబ్బంది రెండు టీమ్‌లుగా ఏర్పడి గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తారని తెలిపారు.

యోగాపై అవగాహన

పెనుబల్లి: యోగా దినోత్సవం సందర్భంగా పెనుబల్లి ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు, నర్సులకు, ఆశా వర్కర్లకు ప్రాణాయామ విశిష్టత గురించి, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి యోగా శిక్షకులు రామకృష్ణ, శిరీషలు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్, ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఫార్మసిస్ట్ అఖిలా, ఆయుర్వేద ఫార్మసిస్ట్ నారాయణమ్మ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడులో ఆత్మీయ సమ్మేళనం

కారేపల్లి: చదువుతోనే సమాజంలో విజ్ఞాన వెలుగులు వస్తాయని సింగరేణి మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల అన్నారు. శనివారం మండలంలోని చీమలపాడు గ్రామంలో ఓంఆదిత్య గాయత్రి స్కూల్ దశాబ్ద ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తమ చిత్రాలతో ఉన్న ప్లకార్డులలో సూక్తులు - సందేశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, మాజీ సర్పంచ్ కిషోర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళతప్పిన కారేపల్లి సంత

- దుకాణాలు లేక వెలవెలబోతున్న వైనం
- ఆసక్తి చూపించని ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న బేరగాళ్లు
- సౌకర్యాలు కల్పించటంలో దేవాదాయశాఖ విఫలం



కారేపల్లి వారాంతపు సంతలో జీవాలు తప్ప.. దుకాణాలు లేని దృశ్యం



సంత నిర్వహణకు వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు (ఫైల్)

కారేపల్లి: కారేపల్లి వారాంతపు సంత కళతప్పింది. ఆదివారం వచ్చిందంటే.. చాలు వేలాది జనాలతో నిండిపోయే సంత, నేడు జనాలు లేక వెలవెల బోతున్నది. ఒకప్పుడు వారానికి సరిపోయే పచారి వస్తువులు సంతలో కొనుగోలు చేసుకొని, మరలా వారం వచ్చే వరకు ఇంట్లో సామన్లు నిండుకునేవే కావు. ఇప్పుడా ఆ దుకాణాలే సంతలో ఏర్పాటు చేయటం లేదు. రైతులు తాజా తాజా కూరగాయలు తీసుకొచ్చి సంతలో అమ్ముకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు..

దేవాదాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా.. కారేపల్లి సంత ప్రజాధారణ కోల్పోతుందని ఇక్కడి ప్రజలు ఆ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో గల కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణ సమీపంలో ఉన్న సుమారు 10 ఎకరాల దేవాదాయ భూమిలో 40సంవత్సరాలుగా వారాంతపు సంతను ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్నారు. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవాదాయశాఖ ఖాతాలో జమచేసి, ఆలయ అభివృద్ధికి, సిబ్బంది జీతభత్యాలకు, ఆలయంలో దూపదీపనైవేద్యాలకు వినియోగిస్తుంటారు. కాగా, ఈఏడాది నిర్వహించిన వేలంపాటలో కారేపల్లి మాజీ సర్పంచ్ ఆదెర్ల స్రవంతి రూ.5.30లక్షలకు దక్కించుకుంది. ఆసమయంలో దేవాదాయశాఖ సంత చుట్టూ ఫెన్సింగ్, రెండు గేట్లు, తాగునీటికై మినీ వాటర్‌ట్యాంక్, పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

సౌకర్యాల లేమి..

సంతలో దేవాదాయశాఖ ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవటంతో, ఇటు పశువుల బేరగాళ్లు, చిన్నచిన్న పచారి వస్తువులు విక్రయించే దుకాణాదారులు సంతకు రావడం లేదు. జనాలకు కావాల్సిన వస్తువులు లభించకపోవడంతో తగ్గుముఖం పట్టారు. ఫెన్సింగ్ లేక, నీటితొట్లు లేక, జనాలకు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో సంతకు ఆదరణ కరువైందని స్థానికులు దేవాదాయశాఖపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్రయవిక్రయాలు లేక.. రవాణా ఖర్చులు రాక..

ఇదివరకు మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు, నాటు కోళ్లు, వివిధరకాల పనిముట్లు, కూరగాయలు అమ్మేవారితో సంతా కళకళలాడేది. కానీ సౌకర్యాలేమి కరణంగా సంత వెలవెలబోతుంది. కనీసం రవాణా చార్జీలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు, బేరగాళ్లు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా దేవాదాయశాఖాధికారులు అన్ని వసతులు కల్పించి మరళ ఆనాటి సోభను తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జనాలు రావట్లేదు..



సంతలో సౌకర్యాలు లేక జనాలు రావట్లేదు. జనాలు తాగటానికి నీళ్లు, పశువులకు నీళ్ల తొట్లు లేవు. సంత సార్లు పట్టించుకుంటే బాగుంటుంది. ఒకప్పుడు సంతకు జనాలు బాగా వచ్చేవాళ్లు. ఆ టైంలో నేను తీసుకొచ్చిన పశువులు ఇట్టనే అమ్ముడయ్యేవి. ఇప్పుడా పరిస్థితి లేక పోగా రవాణా ఖర్చులు అవుతున్నాయి. సంత గురించి పెద్దసార్లు పట్టించుకుంటే బాగుంటుంది.

– గుగులోత్ వెంకట్రావ్, రైతు, మధురానగర్‌తండా

జీలుగు విత్తనాలు పంపిణీ



కొర్లగూడెంలో జీలుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి పచ్చిరొట్ట ఎరువు జీలుగులను పంపిణీ చేశారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై రైతులకు జీలుగులు అందిస్తోంది. కొర్లగూడెం సొసైటీ పరిధిలో గల నారాయణపురం, కొర్లగూడెం, పేరువంచ, ముగ్గు వెంకటాపురం, గోకవరం, ఎర్రబంజరు గ్రామాల రైతులు సబ్సిడీపై జీలుగులు పొందాలని చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి కోరారు. జీలుగులు కావాల్సిన రైతులు పాస్ పుస్తకం జిరాక్స్, రైతు ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు.

చింతకాని సొసైటీ కార్యాలయంలో..



విత్తనాలు అందిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

చింతకాని: చింతకాని సొసైటీ కార్యాలయంలో శనివారం జిలుగు విత్తనాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు చేతులమీదుగా పంపిణీ చేశారు. విత్తనాలు సరిపడా ఉన్నాయని రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీదర్‌రెడ్డి, ఏఓ మానస, డైరెక్టర్లు కోటేశ్వరరావు, మనోహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జమ్ముల జితేందర్‌రెడ్డి

చింతకాని: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాగిలిగొండలో జరిగిన శాఖా మహాసభలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో నియంతృత్వం పెరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీందర్‌బాబు, మల్లిఖార్జున్, భారతమ్మ, రమేష్, చాట్ల రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి ఎస్సై బదిలీ

కారేపల్లి: కారేపల్లి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నార్లపూడి రాజారాం ఖమ్మం రిజర్వుడ్ వేకన్సీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లా సీసీఎస్ విధులు నిర్వహిస్తున్న బైరు గోపి కారేపల్లి ఎస్సైగా రానున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం వరంగల్ డీఐజీ నుంచి ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి.

దుమ్ముగూడెం నీటిని పాలేరులో కలపాలి

ముదిగొండ: దుమ్ముగూడెం నీటిని పాలేరులో కలపడం వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన మండల మూడో మహాసభలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ముగ్గురు మంత్రులు కలిసి దుమ్ముగూడెం నీటిని ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఆంధ్రాకు తరలించే కుట్రకు పూనుకున్నారన్నారు. భూ భారతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అనంతరం రైతుసంఘం నూతన కమిటీని ఎన్నుకన్నారు. మండల అధ్యక్షుడిగా కందుల బాస్కర్‌రావు, కార్యదర్శిగా కొల్లేటి ఉపేందర్‌తో పాటు 17మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మడుపల్లి గోపాల్‌రావు, పురుషోత్తం, ధర్మయ్య, వెంకట్, రమేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

నివాళులు..

బండారి లక్ష్మికి ఎమ్మెల్యే నివాళి..



బండారి లక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి: మండలంలో తొడితలగూడెం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారి మోహన్‌రావు మాతృమూర్తి బండారి లక్ష్మి దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హాజరై నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సుశీలమ్మ చిత్రపటానికి కొండబాల..

ఎర్రుపాలెం: మండలంలోని రామాపురం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కొమ్మూరి గోపాలరావు తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మృతురాలు సుశీలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆమె కుమారులు గోపాలరావు, శ్రీనివాసరావులను పరామర్శించి సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, పుల్లారావు, శ్రీనివాసరావు, కొండలరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, రహంతుల్లా, లింగయ్య, వెంకయ్య, తదితరులున్నారు.

బొక్కా జయరాజుకు..

వైరారూరల్: మండలంలోని కోస్తాల గ్రామానికి చెందిన కళాకారుడు బొక్కా జయరాజు శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. సమచారం తెలుసుకున్న బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్.. జయరాజు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాముల దానయ్య, గుంటి మోహన్‌రావు, కొత్త శ్రీనివాసరావు, వేముల మోహన్‌రావు తదితరులు నివాళులర్పించారు.

బాలస్వామి వర్ధంతి సభ..

చింతకాని: కొదుమూరు మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు నారపోగు బాలస్వామి పార్టీకి విశేష సేవలందించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొదుమూరులో నిర్వహించిన బాలస్వామి వర్ధంతి సభలో మృతుడి స్థూపానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొదుమూరులో 4సార్లు సర్పంచ్‌గా, 2సార్లు ఎంపీటీసీగా, ఒకసారి ఎంపీపీగా గెలిచి పార్టీని అగ్రస్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవిందరావు, రవి, మల్లికార్జున్‌రావు, సుజాత, నారపోగు నాగార్జున్, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరబాబు, చిన్నప్ప, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

పొగాకు వ్యతిరేక దినోత్సవం



మధిర: ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి ప్రశాంతి, అధికారులు



తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మధిర: యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎన్.ప్రశాంతి అన్నారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధిర మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత పొగాకు నమలడం , పొగ తాగడం, పొగాకు ఉత్పత్తుల అమ్మకం, ఎలక్ట్రానిక్ సిగరెట్లు తాగడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు కనకపుడి అనీల్ కుమార్, సీనియర్ న్యాయవాదులు సుంకు మోహన్‌దాస్, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ **ముదిగొండ:** మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం నిర్వహించిన పొగాకు వ్యతిరేక దినోత్సవంలో వైద్యాధికారి అరుణాదేవి పాల్గొని మాట్లాడారు. పొగాకు మానవ జీవితాన్ని కాల్చేస్తుందన్నారు. పొగాకు విడిచి ఆరోగ్యంగా బ్రతుకుదాం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుసూదన్‌రావు, రాణి, సూపర్‌వైజర్లు లత, పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ రామారావు, ఫార్మసిస్ట్ సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

➡ **సత్తుపల్లిటౌన్:** ఆరోగ్యానికి హాని కలిగించే పొగను సేవించటానికి దూరంగా ఉండాలని న్యాయవాది విజయ్‌కుమార్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

➡ **తల్లాడ:** తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రత్న మనోహర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో తల్లాడ ట్రెయినీ ఎస్సై వెంకటేశ్, సూపర్‌వైజర్లు భాస్కర్, పెద్ద పుల్లయ్య, రాజేశ్వరీ, ఎఎన్ఎంలు సురేష్, సంజయ్, కృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

కల్లూరురూరల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.బషిరుద్దీన్ కోరారు. శనివారం మండలంలోని చిన్నకోరుకొంది, పోచారం, పెద్దకోరుకొండి గ్రామాల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువ చైతన్య సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్‌లకు బానిసై యువత ఆరోగ్యం పాడు చేసుకొని అనారోగ్యం కోరితెచ్చుకుంటున్నారని తెలిపారు. ఈ యాత్రకు రాష్ట్ర, జిల్లా రైతు సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, కృష్ణార్జున్‌రావు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, వీరబాబు, సైకిల్ యాత్ర మేనేజర్ నరేష్, యాత్ర బృందం సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమారెమ్మ తల్లి - సంతుసేవాలాల్ విగ్రహాల ప్రతిష్ఠ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో(తండా) దాతల విరాళాలతో నిర్మించిన శ్రీమారెమ్మ తల్లి - శ్రీసంతుసేవాలాల్ విగ్రహాలను శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు, తండా నాయకులు భుక్యా బాలాజీ, మూడు బాలాజీ, బాణావత్ శ్రీను, నూనావత్ లక్ష్మణుడు, గుగులోత్ బాలాజీ లాంఛనంగా ప్రతిష్ఠించారు. గ్రామంలోని దాతల విరాళాల సేకరణతో నిర్మించిన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆర్ రమేష్, ఎంపీడీఓ సురేందర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, నిర్మల, రామారావు, శ్యామ్‌ప్రసాద్, తండా నాయకులు తదితరులున్నారు.



శ్రీసంతుసేవాలాల్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన ఉచిత కరాటే శిక్షణా శిబిరం

సత్తుపల్లిటౌన్: వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి నెలరోజుల పాటు కరాటేలో ఉచిత శిక్షణ నిర్వహించటం అభినందనీయమని సీఐ టి.కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో.. కరాటే నేషనల్ రెఫరీ పిచ్చయ్య ఆధ్వర్యాన నిర్వహించిన వేసవి ఉచిత కరాటే శిక్షణ ముగిసింది. విజేతలకు కరాటే బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో సీఐ టి.కిరణ్‌కుమార్, నిర్వాహకులు

ఏళ్లుగా ఎదురుచూపులే..

ఖరీఫ్‌కైనా సాగునీరు అందేనా..?

- కల్లూరుగూడెం చెరువులకు అందని బేతుపల్లి మిగులు జలాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని లింక్ కెనాల్
- నిర్మాణం మధ్యలో సమస్యగా మారిన భూ సేకరణ



పిచ్చి మొక్కలతో నిండిన లింక్ కెనాల్



కల్లూరుగూడెం తుమ్మల చెరువు

వేంసూరు: వెన్నెలకు ఎండిపోయే భూములున్న కరువు మండలంలోకి బేతుపల్లి జలాలు రావడం చెరువుల జలకళ సంతరించుకొని పంటల సాగు డోకా లేకుండ పోయింది. అయితే వేంసూరు మండలంలోని కల్లురుగూడెం చెరువులకు బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదర్కొంటూ ఏళ్ల నుంచి బేతుపల్లి జలాలు తమ చెరువుల ఎప్పుడు చేరాతాయా అని ఎదురు చూస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న లింక్ కెనల్ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.

600 ఎకరాల ఆయకట్టు..

వేంసూరు మండలం కల్లురుగూడెంలోని తుమ్మల చెరువు, శేషాద్రి చెరువుల కింద మొత్తం 600 ఎకరాలకు పైగ ఆయకట్టు ఉంది. చెరువుల సాగునీరు చేరేలా నాగర్జున సాగర్ కెనల్ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసినా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో నేటి వరకు సాగర్ నీరు రాలేదని, లిఫ్ట్ మరమ్మతులతో అరకొరగా అందుతున్న నీటితో పంటల సాగు కత్తిమీద సాముల మారిందని రైతులు వాపోతున్నారు. కల్లరుగూడెంలోని రెండు గ్రామాలకు నీరు అందితే.. అక్కడ నుంచి ఎదుళ్లవాగు ద్వారా ఆరుగ్రామాల చెరువులకు నీరు అందుతాయని రైతులు వివరిస్తున్నారు.

ఆగింది 500 మీటర్లే..

బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ ఎర్రగుంట పాడు నుంచి కల్లూరుగూడెం చెరువు వరకు దాదాపు 3కిలో మీటర్ల పొడవు ఉన్న లింక్ కెనల్ పనుల్లో భూసేకరణతో నిర్మాణం ఆగింది దాదాపుగా 500 మీటర్లే. బేతుపల్లి నుంచి సాగునీరు అందేలా గత ప్రభుత్వం పనులు ప్రారంభించినా.. రైతులు తమ పొలాలను కాలువకు ఇవ్వడానికి అంగీకరించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సాగునీరు అందెలా చేయాలని గ్రామ రైతులు వేడుకుంటున్నారు. ఈ కెనాల్ పూర్తికాకపోతే భవిష్యత్‌లో సీతారామ ప్రాజెక్ట్ సాగునీరు సైతం అందేలా లేదని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి లింక్ కెనల్ పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

సాగునీరు అందించాలి..



కల్లురుగూడెంలో తుమ్మల చెరువు, శేషాద్రి చెరువులకు బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ ద్వారా లింక్ కెనాల్ పూర్తి చేసి సాగునీరు అందిచాలి. దీంతో 600 ఎకరాల ఆయకట్టు రైతులకుతో పాటు దిగువున ఉన్న గ్రామాల చెరువులకు వెదుళ్ల చెరువు ద్వారా సాగునీరు చేరుతుంది.

– బండి శ్రీనివాసరెడ్డి, రైతు, కల్లూరుగూడెం

అధికారులు చొరవ చూపాలి..



వేంసూరు మండలానికి బేతుపల్లి జలాలు అందుతున్నప్పటి నుంచి నేటివరకు కూడా సాగునీరు అందడం లేదు. అధికారులు స్పందించి లింక్ కెనల్‌లో మిగిలిన కొంత భాగం పూర్తిచేస్తే ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలి.

– పురం రమేష్, రైతు, కల్లూరుగూడెం